## నేడు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు

బొడ్రాయిబజార్, నవంబర్ 23 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు అధిక మొత్తంగా ధాన్యం రావడంతో ఎగుమతుల దృష్ట్యా అలాగే వర్షం వచ్చే అవకాశం ఉన్నందున శుక్రవారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎం.డి.ఫసియుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న శనివారం మార్కెట్ యార్డుకు వచ్చే సరుకులను శుక్రవారం రాత్రి 1 గంట తర్వాతే మార్కెట్ యార్డులోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు.

## ఈవీఎంల కమిషనింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సూర్యాపేట ఎన్నికల అధికారికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 23 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట, కోదాడ పట్టణంలోని మార్కెట్ యార్డుల్లోని గోదాముల్లో గల ఈవీఎం యంత్రాల కమీషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట అసెంబ్లీ బరిలో 20 మంది అభ్యర్థులు, కోదాడ అసెంబ్లీ 34 మంది బరిలో ఉన్నట్లు చెప్పారు. ఈ రెండు నియోజక వర్గాలకు అదనపు బ్యాలెట్ యునిట్లు తీసుకువచ్చి రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. సూర్యాపేట నియోజక వర్గం పరిధిలో 271 పోలింగ్ కేంద్రాలు, కోదాడ నియోజక వర్గంలో పరిధిలో 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. వాటితో పాటు అదనంగా 25 శాతం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కమిషనింగ్ చేస్తున్నట్లు వివరించారు. సూర్యాపేట నియోజక వర్గ పరిధిలో రిజర్వ్‌తో కలిపి 676 బ్యాలెట్ యూనిట్లు, 338 కంట్రోల్ యూనిట్లు , 379 వీవీ ప్యాట్‌లు కమీషనింగ్ చేసి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కోదాడ నియోజక వర్గంలో రిజర్వ్‌డ్‌తో కలిపి బ్యాలెట్ యూనిట్లు 1,110, కంట్రోల్ యూనిట్లు 370, వీవీ ప్యాట్‌లు 414 కమీషనింగ్ చేయడం జరుగుతుందని చెప్పారు. వాటన్నింటినీ సీల్ చేసే సమయంలో అవసరమైన అన్ని జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వీరబ్రహ్మచారి, సూర్యనారాయణ, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### 26 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఈ నెల 26వ తేదీ వరకు ఎన్నికల శిక్షణ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేసే అవకాశం కల్పించడం జరిగిందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు శిక్షణ కేంద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు, పోలీస్ సిబ్బంది సంబంధిత ఆర్వో కార్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఇక్కడ విధులు నిర్వహించే ఇతర జిల్లాల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేలా ఆయా జిల్లాల నుంచి ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ వస్తుందని చెప్పారు. వారు ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు.




## న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించాలి

- ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి అమరావతి

సూర్యాపేటలీగల్, నవంబర్ 23 : న్యాయ వ్యవస్థ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.అమరావతి అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా చూడాల్సిన బాధ్యత న్యాయమూర్తులు, న్యాయవాదులపై ఉన్నట్లుత తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, మండలి సభ్యులు జె.శశిధర్, అశోక్, డిఫెన్స్ కౌన్సిల్ వి.సత్యనారాయణపిళ్లై, పెండ్యం వాణి, న్యాయవాదులు వై.వెంకట బుచ్చేశ్వర్‌రావు, జి.రమాదేవితో పాటు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి.. సంక్షేమం

- తొమ్మిదిన్నరేండ్లలో ప్రజలకు కావాల్సినవన్నీ చేశాం
- తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీ లేదు
- గులాబీ జెండా నీడలో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారు
- విపక్షాల నీచ రాజకీయాలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- మరోమారు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి కొనసాగించుకుందాం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో పలు సంఘాల ఆత్మీయ సమ్మేళనాలు
- వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్ ఆత్మకూర్.ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి


సూర్యాపేట టౌన్, నవంబర్ 23 : అరవయేండ్లకు పైగా పాలించి అన్ని విధాలుగా ఆగం చేసిన విపక్షాల ఆట కట్టించి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి అందరి కండ్లముందు కనిపిస్తున్నదని బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. అటువంటి అభివృద్ధి, ప్రశాంత పాలన కొనసాగాలంటే మరోమారు కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. మొదటి నుంచి తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాలను అడ్డుకుంటూనే ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసిందేమీ లేదన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణంలోని వివిధ వార్డుల నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో భారీగా చేరారు. పలు చోట్ల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలను మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే నియోజక వర్గ వ్యాప్తంగా మండలాల వారీగా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలకు మంత్రి హాజరై మాట్లాడారు. సిండికేట్ దందాలు, రౌడీ రాజకీయాలు, గొడవలు, కొట్లాలు రూపుమాపిన గులాబీ జెండా నీడలో ప్రజలందరూ ప్రశాంతతో సుభిక్షంగా ఉన్నట్లు తెలిపారు. 2014, 2018లో ప్రజలందరి ఆశీర్వాదంతో ఓటు వేసి గెలిపిస్తే ఎంతటి అభివృద్ధి జరిగిందో మనందరికీ తెలుసన్నారు. ప్రజలు కారు గుర్తుకు వేసిన ఓటే సూర్యాపేటను జిల్లాగా మార్చిందని. మెడికల్ కళాశాల ఏర్పాటు జరిగిందని.. రెండు ట్యాంక్‌బండ్‌లు సాధించిందని.. వైకుంఠ ధామాలు, మహా ప్రస్థానాలు వచ్చాయని, రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ఎటుచూసినా పచ్చదనంతో ఆహ్లాదం వచ్చినట్లు వివరించారు. వస్త్ర, వాణిజ్య, వ్యాపారాలు, మాల్ మల్టీప్లెక్స్‌లు రావడంతో ఆర్థికంగా బలపడుతుండడమే కాక ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడినట్లు చెప్పారు. పచ్చని సూర్యాపేటలో మళ్లీ చిచ్చులు పెట్టేందుకు వస్తున్న విపక్షాల నీచ రాజకీయాలకు ప్రజలంతా ఏకమై ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. అభివృద్ధికి చిరునామాగా మారిన గులాబీ జెండా బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి అంతా ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి పాలన కొనసాగించుకుందామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీకి చెందిన బైరు మహేశ్, రాజపురం నాగార్జున, ఫిరోజ్ ఖాన్, మీసాల సైదులు, నజీర్, చితలపాటి శ్రీను, కప్పల సుమన్, మక్తావత్ నాగమణి, రాపర్తి చందు, శ్రవణ్, శ్రీకాంత్, సాయి, వినయ్, సుమన్‌తో పాటు 180 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, అనంతుల యాదగిరిగౌడ్, గండూరి రమేశ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులుగౌడ్, నాయకులు బైరు వెంకన్న, కక్కిరేణి నాగయ్యగౌడ్, పలస వెంకన్న, బైరు దుర్గయ్య, ఎల్గూరి రమాకిరణ్, రాపర్తి శ్రీను, భూతరాజు ఉపేందర్, రాపర్తి సైదులు పాల్గొన్నారు.

### ఆత్మకూర్.ఎస్‌లో కాంగ్రెస్‌కు బిగ్ షాక్

ఆత్మకూర్.ఎస్ : ఆత్మకూర్.ఎస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల గోపాల్‌రెడ్డి, గునగుంటి మల్సూర్‌గౌడ్, ఏపూరు గ్రామం నుంచి కడారి చంద్రారెడ్డి, బీరవెల్లి సుధాకర్‌రెడ్డి, పన్నాల మల్లారెడ్డి, సత్యనారాయణ, కరునాకర్‌తో పాటు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, జిల్లా నాయకుడు మర్ల చంద్రారెడ్డి, సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, ఎంపీటీసీ మిర్యాల వెంకట్‌రెడ్డి, బోళ్ల వెంకట్‌రెడ్డి, తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మం, సత్యనారాయణరెడ్డి, గునగంటి భిక్షం, సైదిరెడ్డి, మిర్యాల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

### సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయం బొడ్రాయి

చివ్వెంల : సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయం గ్రామంలో ప్రతిష్ఠించే బొడ్రాయి అని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోదిన్‌పురం గ్రామ బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దరావత్ కుమారీ బాబూనాయక్, జడ్పీటీసీ భూక్యాసంజీవ్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, సర్పంచ్ నంద్యాల జనార్దన్‌రెడ్డి, జిల్లా నాయకులు రౌతు నర్సింహారావు, గుర్రం సత్యనారాయణరెడ్డి, ఊట్కూరి సైదులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్ : విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ సూర్యాపేట శ్రేణులు

## మాచారంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ

పెన్‌పహాడ్, నవంబర్ 23 : మండలంలోని మాచారంలో గురువారం వేలాది భక్తజనం నడుమ వేద పండితుల ఆధ్వర్యంలో సీతారామాంజనేయ లక్ష్మణ స్వామీ దేవాయలంలో విగ్రహాల ప్రతిష్ఠ, జీవధ్వజ, నవగ్రహ శిఖర, గణపతి, సుబ్రమణ్య స్వామి, రాధాసమేత కృష్ణ, ముత్యాలమ్మ, పోతురాజు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆగమ పండితులు ఇరువంటి యాదగిరి లక్ష్మినర్సింహాశాస్త్రి, వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ అనంతరం స్థానిక సర్పంచ్ బొల్లక సైదమ్మాబొబ్బయ్య, ప్రముఖ న్యాయవాది, విగ్రహాల దాత గ్రంధి వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. భక్తులకు ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు